సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 24 । జూన్ । 2023



వాణిజ్య బ్యాంకులతో సమానంగా డీసీసీబీ సేవలు

వాణిజ్య బ్యాంకులతో సమానంగా డీసీసీ బ్యాంకు సేవలందిస్తుందని డీసీసీబీ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి అన్నారు. -10లో



ప్రణాళికాబద్ధంగా నేరాల నియంత్రణ

జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు ఆదేశించారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.340	రూ.460
రెండోరకం	రూ.240	రూ.330

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1,106 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	311	463
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 427.67 కిలోలు

న్యూస్‌రీల్

లక్ష్మీనరసింహుడి హుండీ ఆదాయం రూ.17లక్షలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ.17,14,750 ఆదాయం వచ్చింది. శుక్రవారం స్థానిక ఆలయంలో టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో గత ఆరునెలలకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్ రాయులు, ఆలయ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, ఆలయ అర్చకులు గోపాలాబట్టర్, అనిల్, కృష్ణ,రాజు స్వాములు పాల్గొన్నారు.

నేడు పెనగలూరుకు ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ ఆలీ రాక

రాయచోటి: పెనగలూరు మండల కేంద్రానికి శనివారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ మహమ్మద్ అలీ రానున్నట్లు ఏపీ ఆన్‌లైన్ సీఈఓ స్ట్రాటజిక్ హెడ్ యనమల భాస్కర్ తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు తిరుపతికి చేరుకొని, అక్కడి నుంచి పెనగలూరుకు వస్తారన్నారు. పెనగలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ ఆన్‌లైన్ సౌజన్యంతో ఇచ్చిన పాఠశాల బెంచ్‌లు, వసతి గృహ మంచాలు, పరుపులు, ఆర్‌ఓ ప్లాంట్లను ఆయన ప్రారంభిస్తారన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 2, 4, 5వ సెమిస్టర్ విద్యార్థులకు, ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా వ్యాప్తంగా 57 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాలను వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తనిఖీ చేశారు.

మిట్స్‌లో నేడు రేడియో స్టేషన్ ప్రారంభం



మిట్స్‌లో రేడియో స్టేషన్

కురబలకోట: మదనపల్లె దగ్గర అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల నూతనంగా కమ్యూనిటీ కోసం రేడియో స్టేషన్ ప్రారంభిస్తోంది. కళాశాల కరస్పాండెంట్ ఎన్ విజయ భాస్కర్ చౌదరి సారథ్యంలో న్యూఢిల్లీ ఏబీసీటీఏఈ చైర్మన్ టీజీ సీతారాం ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. మిట్స్ రేడియో పేరిట 90.8 ఎంహెచ్‌జెడ్ ద్వారా ప్రసారాలు చేయనున్నట్లు తెలిపారు. విద్య, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణం, పాడి పంటలు, స్థానిక సమాచారం తదితర అంశాలపై సమాజానికి అవసరమైన వివిధ కార్యక్రమాలు ప్రసారం చేస్తామన్నారు.

జగనన్న సురక్షతో
సంతృప్త పరిష్కారం

- ప్రతి ఇంటినీ వలంటీర్ సందర్శించాలి
- సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్త స్థాయిలో పరిష్కారమే లక్ష్యంగా పనిచేయండి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి 'జగనన్న సురక్ష' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



'జగనన్న సురక్ష' కార్యక్రమంలో రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సీఎం ప్రసంగాన్ని ఆలకిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ

రాయచోటి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో పాటు.. ప్రజా సమస్యలకు సంతృప్త స్థాయిలో పరిష్కారం చూపడమే.. 'జగనన్న సురక్ష' పథకం ప్రధాన ఉద్దేశం అని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. 'జగనన్న సురక్ష' ప్రథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా లాంఛనంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ సత్యనారాయణ పాల్గొన్నారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం చాలా ముఖ్యమైనదన్నారు. అధికారులందరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించాలన్నారు. సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్త స్థాయిలో పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందని వారుంటే వారిని గుర్తించి సమస్య పరిష్కారానికి కావాల్సిన పత్రాలు స్వీకరించాలన్నారు. వారికేమైనా కుల, ఆదాయ, జనన మొదలైన సర్టిఫికెట్లు అవసరమైతే వాటికి అవసరమైన పత్రాలను తీసుకుని దరఖాస్తులను దగ్గరుండి పూర్తి చేయాలన్నారు. ఇలా తీసుకున్న దరఖాస్తులను సచివాలయానికి తీసుకెళ్లి వాటిని అక్కడ సమర్పించి, టోకెన్ నంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నంబర్ తీసుకుని వాటిని తిరిగి ఇంటి వద్దకే వెళ్లి అందజేయాలన్నారు. ఈ క్యాంపులు ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారో ముందుగానే ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ వివాహ ధ్రువీకరణపత్రాలు, లావాదేవీ మ్యుటేషన్లు, ఫోన్ నెంబర్‌కు ఆధార్ అనుసంధానం , పంటసాగు కార్డులు, కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్‌కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు వంటి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా జారీతో పాటు మరే ఇతర సర్టిఫికెట్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో అందిస్తుందన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు శనివారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. జులై 1 నుంచి క్యాంపులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ మనోహర్‌రాజు, జెడ్పీ కోఆర్డినేటర్ రమణారెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

1902 హెల్ప్ డెస్క్ ద్వారా సేవలు

వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ఇళ్లను సందర్శించినప్పుడు ఇంటి యజమాని ఇంటివద్ద లేకపోయినప్పటికీ వారికి సమీపంలో క్యాంపు జరిగే రోజు నేరుగా అక్కడకు వెళ్లినట్లయితే వలంటీర్లతో కూడిన ఈ టీమ్ '1902' హెల్ప్‌డెస్క్ ద్వారా అవసరమైన సహాయం అందిస్తుంది. ఇక గ్రామంలో సచివాలయ పరిధిలో ఏ రోజు ఈ కార్యక్రమం జరుగుతుందో తెలుసుకోవాలంటే టోల్ ఫ్రీ నంబర్ '1902' కి కాల్ చేయాలి. లేదా https://vswsonline.ap.gov.in/#/ home వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియజేస్తున్నారు.

రాయచోటి సమగ్రాభివృద్ధికి కృషి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

రాయచోటి: రాయచోటి నియోజకవర్గం సమగ్రాభివృద్ధిలో అధికారులు చిత్తశుద్ధితో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ప్రభుత్వ విప్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ స్పందన హాలులో రాయచోటి నియోజకవర్గ అభివృద్ధిపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓ, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు విధులు సక్రమంగా నిర్వహించి సమన్వయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి, విద్యుత్, పంచాయతీరాజ్, గృహ నిర్మాణాలు, మునిసిపల్ పరిధిలో పట్టణ అభివృద్ధి, సుందరీకరణ, పార్కులు, క్రీడా మైదానం ఏర్పాటు, ఎంఐజీ లేఅవుట్ తదితర అభివృద్ధి పనులలో ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఆయా శాఖల అధికారులందరూ బాధ్యతాయుతంగా రాయచోటి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం వహించాలన్నారు. ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. సీఎం జగన్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీస్తోందన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో దాదాపు వెయ్యి ఎకరాలు ఏపీఐఐసీకి కేటాయించేందుకు తగు ప్రణాళికలు రూపొందించాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఇంకా జగనన్న గృహ నిర్మాణాలు చేపట్టని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే నిర్మాణాలు మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. రాయచోటిలో దాదాపు రూ.15 కోట్ల అంచనాతో చేపట్టిన పనులను నాణ్యతగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నియోజకవర్గంలో అసైన్‌మెంట్ భూ పంపిణీ కోసం పారదర్శకంగా జాబితా రూపొందించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, సంబేపల్లె ఎంపీపీ ఎ.శ్రీలత, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రంగస్వామి, వివిధ మండలాల ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథుని బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలు విడుదల



సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను విడుదల చేస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట): ఈనెల 27 నుంచి జరిగే నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలకు అందరూ ఆహ్వానితులేనని నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించిన ఆహ్వానపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 4న కళ్యాణం రోజు భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నం నాగేంద్ర, యల్లంరాచపల్లె సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ పసుపులేటి సుబ్రమణ్యం, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వాసులకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

కడప కల్చరల్ / ప్రొద్దుటూరు : వైఎస్సార్ జిల్లాకు చెందిన ఇద్దరు యువ సాహితీవేత్తలకు 2003 సంవత్సరానికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ యువ సాహితీ పురస్కారాలు లభించాయి. పులివెందులకు చెందిన తక్కెడ శిల జానీకి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం, ప్రొద్దుటూరుకు చెందిన యువ రచయిత, బాల సాహిత్యవేత్త, ఉపాధ్యాయుడు డీకే చదువులబాబులకు కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం లభించాయి. వీరికి ఈ పురస్కారాలు లభించడం పట్ల రాష్ట్ర అధికారభాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య హర్షం వ్యక్తంచేస్తూ అభినందనలు తెలిపారు.

- కేంద్ర సాహిత్య అకాడమీ–2023 సంవత్సరానికిగాను ప్రకటించిన పురస్కారాల్లో యువ, బాల సాహిత్య పురస్కారాలు రెండూ వైఎస్సార్ జిల్లా వాసులకే దక్కడం జిల్లా సాహిత్య ఖ్యాతి మరింత ఇనుమడించిందని ఆయన ప్రశంసించారు.
- 2011లో జిల్లాకు చెందిన సాహితీవేత్త వేంపల్లె గంగాధర్, 2012లో వేంపల్లె షరీఫ్‌లకు కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారాలు లభించగా, ప్రస్తుతం తక్కెడ శిల జానికి ఈ పురస్కారం లభించడంతో.. జిల్లాలో ఈ విభాగంలో మూడు పురస్కారాలు లభించినట్లయింది.
- 1996లో జిల్లాకు చెందిన సీనియర్ కథకులు కేతు విశ్వనాథ రెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం లభించింది.

డీకే చదువుల బాబు



ఈయన ప్రొద్దుటూరుకు చెందిన సాహితీవేత్త. తెలుగు ఉపాధ్యాయుడైన డీకే చదువుల బాబు కవి, రచయితగా ముఖ్యంగా బాల సాహితీవేత్తగా సుపరిచితులు. ఆయన రచించిన వజ్రాల వాన, బాలల కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కారం లభించింది. 1967 జూన్ 1న వైఎస్సార్ జిల్లా పెద్దముడియంలోని పెద్ద పసుపుల గ్రామంలో జన్మించారు. డి.దస్తగిరమ్మ, ఖాసింసాహెబ్ తల్లిదండ్రులు. కమలాపురం మండలం పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూలులో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు. 1983లో బొమ్మరిల్లు బాలల పత్రికలో బాలల కోసం రాసిన కథ ప్రచురితమైంది. నాటి నుంచి ఇప్పటివరకు దాదాపు అన్ని ప్రముఖ దిన, వార, మాస పత్రికల్లో 700కు పైగా బాలల కథలు, 100కు పైగా కవితలు, 50కి పైగా బాలల గేయాలు, వ్యాసాలు, సాంఘిక కథలు రాశారు. కొన్ని నాటికలు కూడా రాశారు. వీరి రచనలు మనరాష్ట్రంలోని 3, 5, 6 తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయి. కొన్ని ఆంగ్ల, కన్నడ భాషల్లో అనువాదం అయ్యాయి. బాల సాహిత్య సాంస్కృతిక సేవా సమితిని 2012లో స్థాపించి విద్యార్థులను కథ, గేయ, వ్యాస, పద్య రచనల్లో ప్రోత్సహిస్తున్నారు. కథ, గేయ రచనలో శిక్షణ ఇస్తున్నారు. కేంద్ర సాహిత్య అకాడమి కార్యక్రమాల్లో పత్ర సమర్పణలు చేశారు. పలు పురస్కారాలు, సత్కారాలు, బిరుదులు అందుకున్నారు.

తక్కెడశిల జానీ



ఈయన 1991 జూన్ 8న వైఎస్సార్ జిల్లా పులివెందులలో జన్మించారు. తక్కెడ శిల ఆశా, చాంద్‌బాష తల్లిదండ్రులు. జానీ ప్రాథమిక విద్య పులివెందుల, ప్రొద్దుటూరులో అభ్యసించి.. పులివెందుల పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చేశారు. కడపలో ఎంటెక్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. 2016 నుంచి ప్రతిలిపి తెలుగు విభాగం ప్రతినిధిగా సేవలు అందిస్తున్నారు. అఖిలాష, విప్లవ సూర్యుడు, నక్షత్ర జల్లులు, బురద నవ్వింది, గాయాల నుండి పద్యాల దాక, పరక తదితర పుస్తకాలు, వై, ఊరి మధ్యలో బొడ్రాయి తదితర దీర్ఘకావ్యాలు, షురు కథల సంపుటి వెలువరించారు. వివేచని, అకాడమి ఆణిముత్యాలు, కవిత్వ స్వరం తదితర సాహిత్య విమర్శ గ్రంథాలు వెలువరించారు. హిందీలో జిందగీకే హీరే పేరిట నానీలను రాశారు. కొన్ని రచనలకు సంపాదకత్వం వహించారు. బాల సాహిత్య విమర్శన గ్రంథాలు రాశారు. మరికొన్ని రచనలు ముద్రణకు సిద్ధంగా ఉన్నాయి. పలు పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. హిందీ, ఇంగ్లీషు, కన్నడం, ఒరియా, మళయాళం, తమిళ భాషల్లో ఆయన కవిత్వం అనువాదమైంది. 300 పుస్తకాలపై సాహిత్య విమర్శలు, 30 కథలు, 700కు పైగా కవితలు, మూడు నవలలు, మరికొన్ని రచనల అనువాదాలు చేశారు.

బుర్ఖా ధరించి.. మాటువేసి..

- కడప నగరంలో సినీ ఫక్కీలో వైఎస్ఆర్‌సీపీ నేత దారుణ హత్య
- జిమ్‌కు వచ్చిన శ్రీనివాసులరెడ్డిని కాపుకాసి హతమార్చిన దుండగులు
- పథకం ప్రకారం నడిరోడ్డుపై కత్తులతో దాడి
- మృతుడి శరీరంపై పది కత్తి పోట్లు
- స్థలాలు, ఆర్థిక లావాదేవీలే కారణమని ప్రాథమిక సమాచారం
- హత్యకు ఆ ఐదుగురే కారణమని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు
- పరామర్శించిన ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి
- కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు



శ్రీనివాసుల రెడ్డి మృతదేహం (ఇన్‌సెట్) (ఫైల్ ఫొటో)



హత్య జరిగిన ప్రదేశంలో స్వాధీనం చేసుకున్న కొడవలి



కడప రిమ్స్ మార్చురీ వద్ద బంధువుల ఆవేదనను వింటున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

సాక్షి ప్రతినిధి, కడప/ కడప అర్బన్: కడప నగరంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యారు. సంధ్యా సర్కిల్ – ఎర్రముక్కపల్లి ప్రధాన రహదారిలో శుక్రవారం ఉదయం 8:10 గంటల సమయంలో వైఎస్ఆర్‌సీపీ నేత చిన్ననాగిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి (42)ని దారుణంగా వేట కొడవళ్లతో, కత్తులతో దారుణంగా హత్య చేశారు. సినీ ఫక్కీలో దుండగులు దారుణానికి పాల్పడ్డారు. శ్రీనివాసుల రెడ్డి రోజుమాదిరిగా సంధ్యా సర్కిల్ సమీపంలో ఉన్న జిమ్‌కు వెళ్లి వస్తుండగా, ఆ భవనం కిందనే బురఖాలు ధరించిన దుండగులు వేట కొడవళ్లు, కత్తులతో మాటు వేసి నరికి, పొడిచి చంపారు. దాదాపు 10 కత్తిపోట్లు మృతుని శరీరంపై ఉన్నాయి. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులరెడ్డి సంధ్యాసర్కిల్ వైపు వంద మీటర్ల మేరకు పరుగులు తీసి కుప్పకూలిపోయాడు. ఈ విషయం తెలిసిన వెంటనే అతని భార్య మౌనిక సంఘటన స్థలానికి చేరుకుంది. స్థానికుల సహకారంతో శ్రీనివాసులరెడ్డిని రిమ్స్‌లో వైద్య సేవల కోసం చేర్పించారు. రిమ్స్‌కు చేరుకున్న కొద్దిసేపటికే శ్రీనివాసులరెడ్డి చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి.

వల్లూరు మండలం చిన్ననాగిరెడ్డిగారిపల్లెకు చెందిన చిన్ననాగిరెడ్డి శ్రీనివాసులరెడ్డి (42), ఖాజీపేట మండలం తిప్పాయపల్లె గ్రామానికి చెందిన మౌనికకు 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి 9వ తరగతి చదువుతున్న మహాదీప్ రెడ్డి (14), 7వ తరగతి చదువుతున్న హనుదీప్‌రెడ్డి(12) సంతానం. వీరు కడప మారుతీనగర్‌లోని నాగార్జున స్కూల్‌లో చదువుతున్నారు. శ్రీనివాసులరెడ్డి మొదట్లో కడప ఒన్‌టౌన్ సర్కిల్‌లో ఉన్న విజయ హోటల్‌లో క్యాషియర్‌గా పనిచేసేవాడు. తరువాత గత ఐదారేళ్ల నుంచి స్థలాల వ్యాపారం, ఇతర చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం మారుతీనగర్‌లో ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా, ఐసీడీఎస్ కడప కార్యాలయం పక్కన ఓ ఇంటిలో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో అతనితో పాటు సహచరులుగా వున్న వారితో ఇటీవల వ్యాపార, ఆర్థిక లావాదేవీలలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. శ్రీనివాసులరెడ్డి రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం సంధ్యాసర్కిల్ సమీపంలో ఎర్రముక్కపల్లి దారిలో ఎడమవైపున వున్న రాబిట్ జిమ్‌కు వ్యాయామ సాధన కోసం వచ్చాడు. కదలికలు గమనించి అంచనాకు వచ్చిన దుండగులు జిమ్ సమీపంలో బురఖాలు ధరించి మాటు వేశారు. జిమ్ నుంచి శ్రీనువాసులరెడ్డి బయటకు రాగానే మారణాయుధాలతో ఒక్కమారుగా అతడిపై దాడి చేసి దారుణంగా నరికారు. కత్తిపోట్లకు గురైన శ్రీనివాసులరెడ్డి దుండగుల నుంచి రక్షించుకునేందుకు కొద్ది దూరం పరుగెత్తి కుప్పకూలిపోయాడు. రక్తపుమడుగులో తీవ్రగాయాలతో పడిపోయిన అతన్ని వదిలేసి, నిందితులు పరారయ్యారు. సమాచారం అందుకున్న శ్రీనివాసులరెడ్డి భార్య మౌనిక సంఘటన స్థలానికి చేరుకుంది. స్థానికుల సహకారంతో భర్తను 108లో రిమ్స్‌లో చేర్పించారు. రిమ్స్‌కు చేరుకోగానే కొంతసేపటికే శ్రీనివాసుల రెడ్డి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాసుల రెడ్డి హత్యకు నిందితులతో వున్న ఆర్థికలావాదేవీలు, స్థలాల తగాదాలేనని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

ఐదుగురిపై అనుమానంతో మృతుని భార్య మౌనిక ఫిర్యాదు

తన భర్తకు అనుచరుడిగా తిరుగుతూ ఇటీవల దూరంగా ఉంటున్న మోపూరి ప్రతాప్‌రెడ్డితో పాటు, పాలెంపల్లి సుబ్బారెడ్డి, జమీల్ మొబైల్స్ అధినేత జమీల్, గుంటి నాగేంద్ర, విశ్వనాథ రెడ్డిలపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుని భార్య మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, రవీంద్రనాథరెడ్డి, అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి

శ్రీనివాసులరెడ్డి హత్య పట్ల కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ఆప్యాయంగా పలుకరిస్తూ వున్న శ్రీనివాసులరెడ్డి హత్యకు గురై తమ మధ్యలో లేడనే విషయం తెలుసుకుని జీర్ణించుకోలేకపోయారు. సంఘటన జరిగిన వెంటనే రిమ్స్‌కు చేరుకుని హత్య జరిగిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకుని భార్య బిడ్డలను ఓదార్చారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, అబ్బిరెడ్డి వీరారెడ్డిలు, వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు, బంధువులు కడప రిమ్స్ మార్చురీ వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ హత్యకు కారణమైన వారిని చట్టపరంగా శిక్షించాలని వారు పోలీసులకు సూచించారు.

నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు

శ్రీనివాసులరెడ్డి హత్య ఘటనపై ప్రజాప్రతినిధులు సీఎం కార్యాలయంకు, డీజీపీకి, జిల్లా ఎస్పీకి సమగ్రంగా విచారించాలనీ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్వి నాగరాజు, ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, ఇతర సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

సిగ్గు.. సిగ్గు

సీఎం సొంత జిల్లా కడపలో శాంతి భద్రతలు క్షీణించిపోయాయి. పట్టపగలే కడపలో నడిరోడ్డుపై హత్యతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అరాచకాలు మితిమీరుతున్నాయి. జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకుల అండదండలతోనే హత్యలు జరుగుతున్నాయి ...

– టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి

- టీడీపీ నేతల హత్యాకాండ వైఎస్సార్‌సీపీకి రుద్దేయత్నం
- పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి వ్యాఖ్యలపై జనం మండిపాటు



చంద్రబాబునాయుడుతో జమీల్, సుబ్బారెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: కడపలో ఓ సామెత ఉంది. 'మొగుణ్ణి కొట్టి మొగసాల ఎక్కింద'ంటారు. అచ్చం అలాగే టీడీపీ నేతల చర్యలుండిపోయాయి. వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులరెడ్డిని నడిరోడ్డుపై దారుణంగా హత్య చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అంశమే. ఆ ముసుగులో రాజకీయ ఆరోపణలే ధ్యేయంగా, ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి చర్యలుండడమే ఆక్షేపణీయం. శుక్రవారం హత్యకు గురైన శ్రీనివాసుల రెడ్డి సతీమణి మౌనిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా టీడీపీ వర్గీయులు కావడమే అందుకు నిదర్శనం. హత్యలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురిలో పాలెంపల్లె సుబ్బారెడ్డి, జమీల్, గుంటి నాగేంద్ర ముగ్గురు కూడా టీడీపీ నేత నారా లోకేష్ యువగళం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. కడప నగరంలో వివిధ టీడీపీ నేతలకు విచ్చలవిడిగా ఫ్లెక్సీలు వేశారు. అనేక సందర్భాల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలతో ఫోటోలు సైతం దిగారు. కడప నియోజకవర్గంలో టీడీపీలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఆ ముగ్గురు హత్యారోపణలు ఎదుర్కొంటుండగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకుల అండదండలతో హత్యలు జరుగుతున్నాయని పత్రికా ప్రకటన విడుదల చేయడం గమనార్హం. నవ్విపోదురు గాక...నాకేటి సిగ్గు అన్నట్లుగా శ్రీనివాసులరెడ్డి చర్యలుండిపోయాని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

అన్ని విభాగాలు అభివృద్ధి సాధించాలి

వైవీయూ : విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలు అభివృద్ధి సాధించాలని, ఆయా విభాగాల్లో జరుగుతున్న అంశాలను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్ ద్వారా ప్రపంచానికి తెలియజేయాలని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో జర్నలిజం, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ విభాగాల వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిశాఖ అకడమిక్‌గా బలోపేతం కావాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విభాగాల్లో జరిగే అభివృద్ధి, కార్యక్రమాల సమాచారం ఐటీ శాఖకు తెలియజేసి, ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ఐటీ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి.శంకర్, అధ్యాపకులు డాక్టర్ టి.శ్యాంస్వరూప్, డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి, డాక్టర్ జి.పార్వతి, డాక్టర్ గణేష్‌నాయక్, ఐటీ సెల్ ప్రతినిధులు అబ్దుల్ రఖీబ్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులతో సమానంగా డీసీసీబీ సేవలు

- రైతులకు, బడుగు, బలహీన వర్గాలకు మరింత మెరుగైన సేవలు
- డీసీసీ బ్యాంకులో వివిధ స్కీములపై ఒక రోజు వర్కషాపు
- హాజరైన ఐదు జిల్లాల డీసీసీ బ్యాంకు సిబ్బంది


సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : నేటి పోటీ ప్రపంచంలో వాణిజ్య బ్యాంకులతో సమానంగా డీసీసీ బ్యాంకు సేవలందిస్తుందని దీంతోపాటు రైతులు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తోందని ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి అన్నారు. శుక్రవారం కడపలోని డీసీసీ బ్యాంకు కాన్ఫరెన్స్ హాలులో బ్యాంకుకు సంబంధించిన వివిధ స్కీములపై సీఈఓ కందుల రాజేంద్రకుమార్ అధ్యక్షతన, ఆప్కాబ్, సీటీఐ వారి ఆధ్వర్యంలో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, కడప డీసీసీబీ సిబ్బందికి ఒక్కరోజు వర్కుషాపు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ డీసీసీ బ్యాంకులు వాణిజ్య బ్యాంకులతో సమానంగా పనిచేయడమే ధ్యేయంగా చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే ఇలాంటి వర్కుషాపులు రాష్ట్రమంతటా నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు, బలహీన వర్గాలకు మరింత మెరుగైన సేవలు వేగవంతం చేయాలని సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ రుణాలు అందించడంలో డీసీసీబీ ముందుండాలన్నారు. ఆప్కాబ్ జనరల్ మేనేజర్ వెంకటరత్నం మాట్లాడుతూ నాబార్డు నుంచి రీఫైనాన్సు రేట్లు బాగా పెరిగాయని అందువలన డిపాజిట్ల సేకరణ చాలా అవసరం అన్నారు. అందుకోసం ప్రజలతో సిబ్బంది మమేకం కావాలని కోరారు. నాబార్డు డీడీఎం విజయ విహారి మాట్లాడుతూ డీసీసీబీలు కూడా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఈఓ కందుల రాజేంద్రకుమార్, ప్రొఫెషనల్ డైరెక్టర్ వీరారెడ్డి, ఆప్కాబ్ డీజీఎం కుమారి, జమున, సీటీఐ అధ్యాపకులు విజయచంద్రారెడ్డిలు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

సొసైటీలను లాభాల బాటలో నడిపించాలి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 77 సహకార సంఘాల ఉద్యోగులు సొసైటీ అభివృద్ధికి కష్టపడి పనిచేసి లాభాల బాటలో నడిపించాలని ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సూచించారు. శుక్రవారం కడపలోని డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో హెచ్‌ఆర్ పాలసీ కోసం ఏపీపీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, అన్నమయ్య జిల్లా యూనియన్, వైఎస్సార్ కడప జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌లు కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డీసీసీ బ్యాంకు చైరపర్సన్ మల్లెల ఝాన్సీరాణి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప జిల్లా పరిధిలో ఉన్న అన్ని సహకార సంఘాల ఉద్యోగులకు జులై 1వ తేదీ నుంచి హెచ్‌ఆర్ పాలసీ పే స్కేల్ ప్రకారం జీతాలను ఇస్తామని దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తి చేశామన్నారు. కడప డీసీసీ బ్యాంకులో 2024 మార్చి నాటికి సహకార సంఘాల ద్వారా ఎవరైతే డిపాజిట్స్ వేస్తారో ఆయా మొత్తాలకు ప్రస్తుత వడ్డీ రేటుతోపాటు అదనంగా 1 శాతం ఎక్కువగా ఇస్తామన్నారు. సంఘాలలో పనిచేస్తున్న సిబ్బందికి ఇంతవరకు హెల్త్ ఇన్సూరెన్స్ కూడా లేనందున వారికి హెల్త్ ఇన్సూరెన్స్ రూ. 2 లక్షల వరకు కడప డీసీసీ బ్యాంకు సమకూరుస్తుందన్నారు. కాగా ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న హెచ్‌ఆర్ పాలసీకి ఇన్నాళ్లకు మార్గం సుగమం చేసినందుకుగాను వైఎస్సార్ జిల్లా, అన్నమయ్య జిల్లా యూనియన్ నాయకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ మనం పనిచేసే సంస్థలు బాగుంటే మనం కూడా బాగుంటామన్నారు. సొసైటీ అభివృద్ధికి సిబ్బంది కష్టపడి పనిచేయాలన్నారు. దీంతోపాటు తమ పరిధిలోని బకాయిలను సకాలంలో వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. సలహాదారు సహదేవరెడ్డి, ప్రొఫెషనల్ డైరెక్టర్ వీరారెడ్డి, ఏపీపీఏసీఎస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీ రెడ్డిబాబు, వైఎస్సార్ యూనియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ బాబుసాని, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ములకలచెరువు : పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లిలోని ఓ ఇంటిలో జిల్లా స్పెషల్ స్క్వాడ్ సీఐ మురళీకృష్ణ, సిబ్బంది వేణుగోపాల్ దాడులు నిర్వహించి, 81 ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి వేమనారాయణమ్మ (57), ఎన్.వెంకటేష్ (29)పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిని విచారణ చేయగా.. ఎస్‌ఈబీకి చెందిన ఓ అధికారి డ్రైవర్ పాత్ర ఉందని వెల్లడించినట్లు సమాచారం. అలాగే ఓ కానిస్టేబుల్‌తోపాటు అధికారి పాత్ర ఉందనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎస్‌ఈబీ ఈఎస్ మధుసూధన్ శుక్రవారం రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు. ఈ అక్రమ దందా వెనుక ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

సిద్దవటం(ఒంటిమిట్ట) : సిద్దవటం మండల పరిధిలోని పరసర ప్రాంతాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ పురుషోత్తం బాబు తెలిపారు. శుక్రవారం సిద్దవటంలోని ఎస్‌ఈబీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కడప జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ ఆదేశానుసారం సిద్దవటం ఎక్సైజ్ సీఐ విశ్వనాథరెడ్డి సూచనలకు అనుగుణంగా శుక్రవారం తెల్లవారుజామున నిఘా పెట్టడం జరిగిందన్నారు. రాజంపేటకు వెళ్లే దారిలో గల పెట్రోల్ బంక్ సమీపాన, అలాగే సిద్దవటం మట్టికోట సమీపాన అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గోవిందు, చిన్నయ్యను సిద్దవటం ఎక్సైజ్ ఎస్ఐ ఆధ్వర్యంలో సిబ్బంది అదుపులోనికి తీసుకున్నారని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అగ్నిప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం

మదనపల్లె : మదనపల్లె సొసైటీ కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. సొసైటీ కాలనీలో కాపురం ఉంటున్న రెడ్డెప్ప భార్య నాగలక్ష్మి(45) ఇంట్లో గ్యాస్ స్టవ్ పక్కన ఉన్న కట్టెల పొయ్యి వెలిగించి వీధిలో కూర్చొని పక్కింటివాళ్లతో మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో గృహోపకరణాలు, ఇంటిపత్రాలు, భూమిపత్రాలు, పూర్తిగా కాలిపోయాయి. నాగలక్ష్మి పాక్షికంగా గాయపడింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక అధికారి శివప్ప సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడిన నాగలక్ష్మిని జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి


గాయపడిన సయ్యద్‌బాషా

చిన్నమండెం : అన్న సయ్యద్‌బాషాపై తమ్ముడు బాషావలి కత్తితో దాడి చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఒకే ద్విచక్రవాహనంలో అన్నదమ్ములైన షేక్ బాషావలి, షేక్ సయ్యద్‌బాషా, బాషావలి కొడుకు యాసిన్‌లు రాయచోటి నుండి చిన్నమండెం వైపు బయలుదేరారు. దేవగుడిపల్లె కస్తూరిబా పాఠశాల వద్దకు రాగా బాషాఅలీ తన అన్న అయిన సయ్యద్‌బాషాపై కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో సయ్యద్‌బాషా చేతులు, తలకు రక్తగాయాలయ్యాయి. బాధితుడిని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలియజేశారు.

బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి


జిల్లా మత సామరస్య కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, పక్కన ఎస్పీ, జేసీ

రాయచోటి : బక్రీద్‌ను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, చట్టాలకు లోబడి సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. ఈ నెల 29 నుంచి ప్రారంభమయ్యే బక్రీద్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఎస్పీ గంగాధర్ రావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలిసి వివిధ శాఖల అధికారులు, అన్ని మతాల పెద్దలతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మత సామరస్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మత సామరస్యానికి ప్రతీక అని, అందరి సహకారం వల్లనే ఇది సాధ్యమైందని, ఇలాంటి సహకారాన్ని ముందు ఇలాగే కొనసాగించాలని కోరారు. బక్రీద్‌ను ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలుగ చేయకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సున్నితమైన సమస్య తలెత్తినా వెంటనే పోలీస్, రెవెన్యూ శాఖలకు తెలియజేయాలని సూచించారు. క్రితం ఏడాదిలాగానే ఈసారి కూడా అందరూ సంతోషంగా పండుగ జరుపుకునే విధంగా అవగాహన కల్పించాలని, ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తాత్కాలిక జంతువధశాలలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక పారిశుధ్యం, అవసరమైన నీటిసౌకర్యం ఏర్పాటు, వేస్ట్‌ను దూరంగా జాగ్రత్తగా డిస్పోజ్ చేయాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా అన్ని మతాల వారు పరస్పరం సహకరించుకొని సోదరభావంతో జరుపుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇతరులకు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా జరుపుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, రాయచోటి మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు, వివిధ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

సింహాద్రిపురం : మండల పరిధిలోని అగ్రహారం పొలంలో విద్యుత్ లైన్లు ప్రమాదవశాత్తు బోరు లారీకి తగిలి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నారాసింగ్ (19) అనే కూలీ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కూలీలు తమ బోరు బండి ద్వారా బోరు వేసేందుకు అగ్రహారం గ్రామానికి చెందిన రైతు పొలంలోకి వెళ్లారు. బోరు వేస్తున్న సమయంలో 33 కె.వి విద్యుత్ లైన్లు బోరు బండికి తగిలి విద్యుత్ సరఫరా అయి.. భూమిపై నిలిచి ఉన్న కూలీ లారీకి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో ఆయన మృతి చెందాడు.

ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యం


మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, కొండూరు అజయ్‌రెడ్డి

రైల్వేకోడూరు : మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంపైన స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన 60 మంది మహిళలకు ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన వారికి కుట్టుమిషన్‌లు పంపిణీ చేయడంతోపాటు ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. అలాగే మిషన్‌లు పొందిన వారు జగనన్న ఇచ్చే 10 వేలకి అర్హులుగా ఉంటారన్నారు. ఇంట్లోనే మహిళలకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలకు మూడు నెలలు శిక్షణ ఇచ్చారని, వారందరికీ కుట్టు మిషన్లు, ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. ఇంట్లోనే ఉంటూ కుట్టుమిషన్ ద్వారా మహిళలు ఆదాయం ఆర్జించే విధంగా పని చేయాలన్నారు. దీనితో ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందన్నారు. అనంతరం కొండూరు అజయ్‌రెడ్డి మాట్లాడుతూ రైల్వే కోడూరు, రాజంపేటలలో మూడు సార్లు జాబ్‌మేళాలు నిర్వహించి స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో వేలాది మందికి పెద్ద కంపెనీలలో ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ సెంటర్లలో పలు రంగాలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ఏపీఎండీసీ సీపీవో సుదర్శన్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ గోపినాథ్, డిస్ట్రిక్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, ఉప సర్పంచ్ తోట సాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించినప్పుడే మహిళాభివృద్ధి


జాతీయ సదస్సులో మాట్లాడుతున్న యోగివేమన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.వినోదిని

మదనపల్లె : నిత్యజీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించినప్పుడే మహిళాభివృద్ధి సాధ్యపడుతుందని యోగివేమన విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్.ఎం.వినోదిని అన్నారు. మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అధ్యక్షతన ఐసీఎస్ఎస్ఆర్ రెండు రోజుల జాతీయ సదస్సులో భాగంగా 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో మహిళల అభివృద్ధి, సవాళ్లు అంశంపై సెమినార్ నిర్వహించారు. మొదటిరోజైన శుక్రవారం సదస్సుకు యోగివేమన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్.ఎం.వినోదిని, పద్మావతి మహిళా యూనివర్సిటీ డాక్టర్.ఎం.పద్మావతి, కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం డాక్టర్.కె.శైలమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వతంత్ర భారతదేశంలో స్త్రీ ఔన్నత్యాన్ని, చరిత్రలో స్త్రీల కోసం జరిగిన అనేక పోరాటాలు, అస్తిత్వం నిలుపుకొనేందుకు చేసిన ప్రయత్నాలు, స్త్రీజాతి ఉద్ధరణకు పాటుపడిన మహిళలు, ఆర్థిక సాధికారత, ఆత్మగౌరవం, మహిళా చైతన్యం దిశగా సాధించిన ఘన విజయాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్.ఎం.వినోదిని మాట్లాడుతూ స్త్రీలు ఎంతటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా నిలబడగలరన్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తూనే ఉన్నారన్నారు. స్త్రీలు వృద్ధి చెందితే సమాజం వృద్ధి చెందుతుందన్న మహనీయుడు అంబేడ్కర్ సాక్షిగా నేడు మహిళల జీవితంలో అనేక పెను మార్పులు సంభవించాయన్నారు. చదువు తప్ప ఆడపిల్లలను ఉన్నతస్థానాలకు మరేది తీసుకెళ్లదని భావించి గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు సైతం బిడ్డలను చదివించేందుకు శక్తికి మించి తాపత్రయ పడుతున్నారన్నారు. డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ.. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ అవగాహన లేక నిరుపయోగంగా ఉన్నాయన్నారు. పితృస్వామ్య వ్యవస్థ కారణంగా మహిళలను ద్వితీయశ్రేణిగా చూస్తున్నారే తప్ప తన ప్రాధాన్యతను గుర్తించడం లేదన్నారు. పదో తరగతి తర్వాత బాలిక విద్యకు అనేక అవరోధాలు ఏర్పడుతున్నాయని, కేవలం 60 శాతం మహిళలు మాత్రమే యూనివర్శిటీలలో ఉన్నతచదువులు చదువుతున్నారన్నారు. ఒక మహిళ చదివితే తన కుటుంబాన్ని చదివించడమే కాకుండా ఆర్థికంగా పైకి తీసుకురాగలుగుతుందన్నారు. సమాజంలోని సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పద్మావతి యూనివర్సిటీలో మహిళలకు జనరల్ స్టడీస్- సెల్ఫ్ డిఫెన్స్(ఆత్మరక్షణ) సబ్జెక్టుగా బోధించడం జరుగుతోందన్నారు. డాక్టర్.శైలమ్మ మాట్లాడుతూ.. మహిళలు వికాసం చెందేందుకు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహకులు డాక్టర్.బి.జ్యోతి, లెక్చరర్స్ మోహనవల్లి, నమ్రత, వనజ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా నేరాల నియంత్రణ


జిల్లా నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి : జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్సు హాల్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జిల్లా నేర సమీక్షా సమావేశాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయం, ప్రాంతాలను విశ్లేసించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని, విస్తృతంగా వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. జూన్ నెలలో నమోదైన కేసుల దర్యాప్తులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ కేసుల దర్యాప్తు మెలకువలపై వారికి దిశా నిర్దేశాలు చేశారు. నాన్ బెయిలబుల్ వారెంట్స్ పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్‌ను త్వరితగతిన ఎగ్జిక్యూట్ చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. నిషేధిత గుట్కా, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేయాలన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై నిఘాపెట్టి వారి ప్రస్తుత వివరాలపై ఆరా తీయడంతోపాటు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. నేరాల నియంత్రణకు రాత్రిపూట గస్తీలను పటిష్టంగా అమలుపరిచి, లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అనుమానిత వ్యక్తులను తనిఖీ చేయడం, ముఖ్య కూడళ్లల్లో వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. సైబర్ ఫ్రాడ్స్, దిశా యాప్, యాంటీ డ్రగ్స్ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా అడిషనల్ ఎస్పీ రాజకమల్ పాల్గొన్నారు.